# భోజ్యేషు మాతా!...

"రండి శేషగిరిరావుగారూ! సమయానికొచ్చారు. ఆ ప్లేటు తీసుకోండి, భోంచేద్దురుగాని" అంది మంజుల. శేషగిరిరావు అంకుల్ ఎప్పుడూ సమయానికే వొస్తారు, భోంచేస్తారు, ఆయనని భోంచెయ్యమని అడగకపోయినా, ఆయనే ప్లేటు పట్టుకుని వడ్డించుకు తినేస్తారు" అంది మృదుల నవ్వుతూ.

అదేదో తమాషాకి అన్నా శేషగిరిరావుగారి మొహంలో రంగులు మారడం గమనించింది మంజుల. కూతురి కేసి కోపంగా చూసింది. తల్లి చూపుల్లోని మందిలింపు 'అలా అనొచ్చా' అని తిడుతున్నట్లనిపించింది మృదులకి!

ఇంతకీ తనేమందనీ? ఉన్న మాటేగా! శేషగిరిరావుగారు ఎప్పుడొచ్చినా భోంచెయ్యందీ వెళ్ళడు. అందుకే అలా అంది తను. అందులో కోపం రావడానికేముందీ?' అనుకుంది.

దగ్గరుండి వడ్డిస్తోంది అమ్మ. 'ఇంకొంచెం వేసుకోరా! అంటూ బలవంతంగా అమ్మ చేత వడ్డింపచేస్తున్నారు రామారావుగారు. మృదులకి తల్లిదండ్రుల ప్రవర్తన వింతగా తోచింది. ఆయనెప్పుడొచ్చినా, అమ్మా నాన్నా ఎందుకలా కుక్కి కుక్కి తినిపిస్తారు? ఆ మాటే పైకి అంది అంకుల్ వెళ్ళిపోయాక మృదుల తల్లితో!

మంజుల చెప్పడం మొదలెట్టింది. 'శేషగిరిరావు అంకుల్ భార్య త్రివేణికి వంట సరిగ్గా రాదు. నేర్చుకోవాలనే ఆసక్తి లేదు. చచ్చేంత బద్ధకం ఆవిడకి? రుచీ, పచీ లేకుండా చేసే ఆవిడ పెట్టే భోజనం తినలేక అస్తమానం ఏ హోటల్లోనో తింటాడు శేషగిరిరావు. అతనికి ఆలుగడ్డ వేపుడు ఎంతో ఇష్టం. ఆవిడకి ఇష్టం లేదుట అందుకని ఛస్తే ఆలుగడ్డ వేపుడు, ఎక్కడైనా వుందీ అంటే అక్కడే భోంచేస్తాడు. ఏం చేస్తాడు మరి? "ఆంటీకి ఆలుగడ్డ ఇష్టం లేకపోతే, ఆవిడకి వేరే కూర చేసుకుని అంకుల్‌కు మట్టుకు చెయ్యొచ్చుగా! అంతేగాని అంకుల్ తినకపోయినా సరే, అదే చేసేసి మానెయ్యడమేమిటి?" అంది ఆశ్చర్యంగా మృదుల.

"అదే మరి! మగాడికి పగలల్లా ఆఫీసులో చచ్చీ చెడీ పనిచేసి, ఇంటికొచ్చేసరికి ఆదరంగా తన కిష్టమయిన పదార్థాలతో భోజనం పెట్టే భార్య లేకపోతే ఎలా అనిపిస్తుంది. 'కోటి విద్యలూ కూటికొరకే అన్నారు. కడుపు నిండా తిండి వుంటేనే కదా, కంటినిండా నిద్రపట్టేది? ఈ రెండూ ఇంట్లో కరువైతే మొగాడ్, హోటల్ భోజనం, మఠం నిద్రా కోరుకుంటాడు. ఇంటి పట్టున వుండక, ఇంటినీ ఇల్లాలినీ తప్పించుకుని తిరుగుతాడు. అప్పుడు మళ్ళీ లబో దిబోమని ఏడ్చేది ఆ ఇల్లాలే! భర్త కనీస అవసరాలను దగ్గరుండి చూసుకునే ఇల్లాలు దొరికితే, అంతకన్నా స్వర్గం లేదనుకుంటాడు మొగాడు.

'బిడ్డ ఆకలి తల్లికి తెలుసు' అనే నానుడి వుంది. బిడ్డ అడగకుండానే మాటలు రాని పసికందుకి సయితం ఆకలిని గ్రహించి అన్నం పెడుతుంది తల్లి! బిడ్డ ఇష్టా ఇష్టాలు తెలుసుకుని, బిడ్డకి కావలసినది చేసి పెడుతుంది. బాబుకి పాయసం ఇష్టమయితే బడినుంచి వచ్చే సమయానికి వేడిగా పాయసం కాచిపెడితే ఎగిరి గంతేసి పాయసం తాగుతాడు బాబు! ఆ తల్లి తృప్తిగా నిట్టూరుస్తుంది. అందుకే భార్య భర్తకి వడ్డించేవేళ, తల్లి పాత్ర వహించాలి అన్నారు.

'భోజ్యేషుమాతా!' అని భర్త ఆకలి తెలుసుకుని, అతని రుచులు తెలుసుకుని తదనుగుణంగా అన్నీ కమ్మగా చేసిపెట్టి, దగ్గరుండి కబుర్లు చెబుతూ భార్య వడ్డిస్తే ప్రపంచంలోని బాధలన్నీ మర్చిపోయి ఆ పదార్థాలని అమృతంలా సేవిస్తాడు అతగాడు. 'గుత్తి వంకాయ్ కూరోయ్ బావా, కోరివండి పెట్టినానోయ్ బావా! కూరలోన వలపునంతా కూరి పెట్టినానోయ్ బావా!' అంటుంది వలపులు చిందిస్తూ జానపద నాయకి తన ప్రియుడూ, చెలికాడు అయిన జతగాడితో! అలా అంటూ వడ్డిస్తే, నోరూర్చుకుంటూ నాలుగు ముద్దలు ఎక్కువే తినడూ?' భర్త సుఖంగా వుంటేనే కదా! భార్యకి సౌభాగ్యం?

'పాపం శేషగిరిరావు అంకుల్! సారీ మమ్మీ నాకు తెలీక వేళాకోళం చేశాను' అంది మృదుల.

"పోనీలే అదీ ఒకందుకు మంచిదే అయింది. రేపు నువ్వూ జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయం 'భోజ్యేషుమాతా! నవ్వింది మంజుల! *